

# కలకంఠి కథలు

## - శ్రీధర



ఈ కథల గురించి:

*1992లో ఈనాడులో వసుంధర పేజీ ప్రారంభించారు. స్త్రీలకు సంబంధించిన అంశాల కోసం. రామోజీరావు గారి సూచనలతో ఎడిటర్ వర్మగారు ప్రతి గురువారం ఒక వుమన్ ఓరియెంటెడ్ ఆర్టికల్ ఉండాలని నిర్ణయించారు. అప్పటికే శ్రీధర విష్ణుప్రియ కాలమ్ రాస్తున్నారు. అందుచేత స్త్రీలకు ఆసక్తికరంగా ఉండే ఒక ఆర్టికల్ రాయమని శ్రీధరని అడిగారు. మర్నాడు ఆర్టికల్ రాసిచ్చారు. దానిపేరు 'అమ్మకు ఎన్నడన్నా థాంక్స్ చెప్పారా?', బాగానే ఉందనిపించినా, రెస్పాన్స్ ఎలా ఉంటుందో నన్న చిన్న అనుమానం వర్మగారికి ఉండనే ఉంది. కానీ ఆ రాత్రి కంపోజింగ్ చేసినవాళ్లూ, పేజీ మేకప్ చేసినవాళ్ళు 'ఆగి, కళ్లు తుడుచుకున్నాం 'అని చెప్పినప్పుడు ఆయన అనుమానం నివృత్తి అయింది. అచ్చయ్యాక, చదివిన ప్రతివాళ్లూ, అవునూ, మా అమ్మ మా కోసం ఎంతో చేసింది, థాంక్స్ చెప్పాలన్న ఆలోచనే రాలేదు ' అని అన్నారు. తర్వాత వరసగా నాలుగు వారాలు ఇంకా ఎన్నాళ్లు నాకీ సంకెళ్ళు? 'దయచేసి అనాగరికుల అడ్రస్ చెప్పండి, 'ఇల్లాలి హృదయవేదనా నివేదన 'రాశారు. అనూహ్యమైన స్పందన వచ్చింది. 'నేను వ్యాసాలు రాయించాలనుకున్నాను, మీరు రాసిన వ్యాసాలు కథల్లానే ఉంటున్నయి, ఇంక కథలే రాయండి...' అన్నారు వర్మగారు. స్త్రీలకు సంబంధించిన పేజీ కనుక 'మల్లిక' పేరుతో ప్రతి గురువారం ఒకటి కాదు, రెండు కాదు నాలుగు వందల ఆణిముత్యాల్లాంటి కథలు ఒక దశాబ్దం పాటు ఏకబిగిన రాశారు. చాలా మందికి ఎవరీ మల్లిక, అన్న ప్రశ్న ఎదురైంది. ఈనాడుకు ఫోన్ కాల్స్ చేసినవారిలో ఎంతో మంది ప్రముఖులూ ఉన్నారు.*

*ఎందరో సాహిత్యాభిమానులను గురువారం ఉదయం కోసం వసుంధర పేజి కోసం ఎదురు చూసేలా ఆసక్తి కలిగించిన శ్రీధర (మల్లిక) కథలు, కౌముది పాఠకుల కోసం ముఖ్యంగా నవతరం కోసం... ప్రతి నెలా.. చదవండి.!!*

# డైరీ లో పేజీలు

***ఫిబ్రవరి, 10***

ఒకరికి వరం అయినదే మరొకరికి శాపం అవుతుంది. ఎవరిదాకానో ఎందుకు నా విషయం లోనే ఇది నిజం అనిపిస్తుంది. నాలుగేళ్ళ కిందట ఉద్యోగం వచ్చినప్పుడు జీవితం ఒక గొప్ప మలుపు తిరిగింది అనుకున్నాను. ఇది దేవుడు నా కిచ్చిన గొప్ప వరం అనుకున్నాను. కానీ ఇప్పుడు ఆ ఉద్యోగమే అగ్ని పరీక్ష పెడుతున్నది. నన్నూ నా భర్తనూ విడదీసింది. శాశ్వతంగా దూరం అయిపోయే పరిస్థితి ఏర్పడింది. ఉద్యోగం పేరుతో చేజేతులా సంసారాన్ని నాశనం చేసుకున్నానా అని అనిపిస్తున్నది. నాకు ఉన్న ఊరు నుంచి ట్రాన్స్ ఫర్ అయింది. ఆరు వందల కిలో మీటర్ల దూరం వచ్చేసాను. అంత దూరం వెళ్ళి

వెలగ బెట్టే దేమిటి రాజీనామా చేసి ఇంట్లోనే ఉండమన్నారు. ఆయనకూ, ఆయన తల్లికీ సేవలు చేస్తూ అక్కడే ఉండి పోవాలని ఆయన కోరిక. నేనే ఎందుకో అలా ఉండలేక పోయాను. వండి పెట్టటం, పిల్లల్ని కనటం మాత్రమే జీవిత లక్ష్యం కాకూడదు అని నా అభిప్రాయం. ఉద్యోగం చెయ్యటం, సంపాదించటం ఇవి నాకు గర్వ కారణం.

*ఫిబ్రవరి 15*

శివరాం తమషా అయిన మనిషి. ఆఫీసులో నా పక్క సీటు లో కూర్చుంటాడు. రోజూ ఒక గంట ఆలస్యంగా వస్తాడు. ఒక గంట ముందుగానే వెళ్ళిపోతాడు. రూల్సు గురించి ఎంత వరకూ పాటించాలో, ఎంత వరకు తప్పించుకోవాలో తెలుసుకోవాలని చెబుతుంటాడు. అతను చాలా సరదాగా చిలిపిగా మాట్లాడుతుంటాడు. అతను అంటే కొంత అభిమానం ఏర్పడింది.

*ఫిబ్రవరి 22*

ఇవాళ ఆయన దగ్గర నుంచి వచ్చిన లెటర్ మనసును కలవర పరిచింది. అయన కావాలో, ఉద్యోగం కావాలో తేల్చుకో మన్నారు. పది రోజులు గడువు పెట్టారు. ఈ పది రోజుల లోపల రాక పోతే ఇంక ఎప్పటికీ రావద్దదన్నది ఆయన ఉత్తర లోని సారాంశం. నాకు భర్త ముఖ్యమే. ఉద్యోగమూ ముఖ్యమే. దేన్నీ వదులుకోలేను.

*ఫిబ్రవరి 23*

శివరాం నాలో వచ్చిన మార్పు కనిపెట్టాడు. అలా ఉన్నారేమిటని అన్నాడు. ఉద్యోగానికి రాజీనామా చెయ్యాలేమొ నని బాధ అన్నాను. సమస్య ఏమిటో చెప్పాను. "ఈ ఆఫీసులో మీకో స్థాయి వుంది. ఎంతో ప్రావీణ్యం వుంది. మీలాంటి వాళ్ళు వంట ఇంటికే పరిమితం కావటాన్ని మేము వొప్పుకోము" ...అన్నాడు శివరాం. ఆ మాటలు సహజంగానే నాకు నచ్చాయి.

*మార్చి 15*

ఆయన పెట్టిన గడువు తీరి పోయింది. నేను ఉద్యోగం వదులుకో లేకపోయాను. అంటే భర్తను వదులుకుంటానని కాదు. ఆయన ప్రతిపాదన నాకు నచ్చ లేదు. ఒక వ్యక్తికి భార్య అయినంత మాత్రాన వ్యక్తిత్వాన్ని చంపుకుని, మానసిక వికాసాన్ని పోగొట్టుకుని నిర్జీవ ప్రతిమలా బతకవలసిన అవసరం లేదు. కొంత మంది మనుషులు కాలంతో పాటు మారరు. చుట్టూ ఉన్న వాళ్ళని మారనివ్వరు. ఇలాంటి వాళ్ళ కోసం పరుగెత్తే కాలం ఆగదు. వీళ్ళే వెనకబడి పోతారు.

*ఏప్రిల్ 2*

శివరాం ప్రవర్తనలో ఈ మధ్య మార్పు కనిపిస్తున్నది. ఊరికే పొగడ్తలతో ముంచెత్తుతున్నాడు. నా వంకే తదేకంగా చూస్తున్నాడు. నాకు దగ్గర కావటానికి ప్రయత్నిస్తున్నాడు. కానీ నేను వివాహితను. పరాయి వాళ్ళు దగ్గర కావాలని చూసినా నేను దూరంగా ఉండటానికి ప్రయత్నిస్తాను.

*మే 8*

ఇవాళ నారాయణ కనిపించాడు. ఆయనది మా ఊరే. మా ఇంటి విషయాలూ చెప్పాడు. నా భర్త ఎవరో అమ్మాయిని తెచ్చి ఇంట్లో పెట్టుకున్నాడట. ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడని కొందరు, ఇంకా చేసుకోలేదని కొందరు చెప్పుకుంటున్నారట. భార్యా భర్తల బంధం ఇంత అల్పమైనదా ? కొద్ది నెలలు దూరంగా ఉన్నంత మాత్రాన ఆ బంధం తెగిపోతుందా? ఇంట్లో చాకిరీ చెయ్య టానికి ఎవరినన్నా తెచ్చి పెట్టుకుంటే ఫర్వా లేదు. కానీ పెళ్ళి చేసుకునేదాకా వచ్చిందంటేనే బాధ పడాల్సి వస్తుంది.

*మే 15*

శివరాం ఎప్పుడూ సరదాగా మాట్లాడుతూ ఉంటాడు. ఏది మాట్లాడినా చివరకు దాన్ని ప్రేమ, పెళ్ళి దగ్గరకు తీసుకు వస్తున్నాడు. ఆఫీసులో ఈ కబుర్లు ఏమిటని చనువుగా కోపడ్డాను. మర్నాడు నా ఇంటికే వచ్చాడు. "ఆఫీసులో ప్రేమలు, పెళ్ళిళ్ళు గురించి మాట్లాడ వద్దని అన్నారు గదా. అందుకని, ఇంట్లో మాట్లాడుకుందామని వచ్చాను " అన్నాడు. "మీ భార్యా భర్తల మధ్య ఉన్న గొడవలు నాకు తెలుసు. నువ్వు ఊ అంటే నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను " అన్నాడు. "ఉద్యోగరీత్యా దూరంగా ఉన్నంత మాత్రాన మేము విడి పోయినట్లు కాదు. రోజంతా మౌనంగా ఉండలేము గనుక ఎప్పుడన్నా మాట్లాడుతాము. అంత మాత్రాన ఏవేవో ఊహించు కోవద్ద"ని చెప్పాను. అయినా అతని ధోరణి లోనే అతను మాట్లాడు తున్నాడు. ప్రేమించే మనిషికి నేను అక్కర లేదు. నన్ను ప్రేమించే మనిషి నాకు అక్కర లేదు. నేను భర్తను వదులు కోలేక పోతున్నాను. శివరాం నన్ను వదులుకో లేకపోతున్నాడు. భర్త దగ్గరకు వెళ్ళాలంటె భయం. ఏమ్ చూడాల్సి వస్తుందో నని. వెళ్ళక పోతే వ్యవహారం శ్రుతి మించి పోతుందేమోనని భయం.

*మే 24*

అనుకున్నట్లుగానే జరిగింది. ఆయన మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. అదెలా సంభవం. భార్య బ్రతికి ఉండగానే, ఆమెకు విడాకులు ఇవ్వకుండగానే మళ్ళీ ఎలా పెళ్ళి చేసుకుంటాడు ? అది నేరం కదా ?

*జూన్ 1*

శివరాం వ్యవహారం శ్రుతి మించుతున్నది. పెళ్ళి చేసుకుందా మంటూ తొందర పెడుతున్నాడు. అది ఈ జన్మకు జరగదని చెప్పాను. పోలీస్ కంప్లైంట్ ఇస్తానని కూడా బెదిరించాను. నా కోసం జైలుకే కాదు నరకానికైనా వెళ్ళటానికి సిద్ధంగా వున్నానని అంటున్నాడు. ఇదెక్కడి గోల ?

*జూన్ 10*

మా ఆఫీసరు రామలింగం దగ్గరికి వెళ్ళాను. విషయం అంతా చెప్పాను. రెండు నెలలు సెలవు పెట్టాను. ఆ తరువాత మరో చోటకు బదిలి చేయమని కోరాను. అందుకు ఆయన అంగీకరించాడు. అక్కడికి ఒక సమస్య పరిష్కారం అయింది. ఇక రెండో సమస్య. భర్త విషయం. అక్కడికి వెళ్ళాక గాని తెలియదు. అవసరమైతే కేసు పెట్టక తప్పదు. ఆ వ్యవహారం లో మరో స్త్రీ నలిగి పోతుందని తెలిసినా, తప్పదు మరి. ఒకరికి వరం మరొకరికి శాపం.

★★★★★★★★★★★★ (వచ్చేనెల మరో కథ)